
# నే...తాజ్‌మహల్ చూడను!!?

జి. రామచంద్రయ్య



పోస్టుమెన్ కేక విని బయట కొచ్చింది సులోచన. ఉత్తరం చేతికి తీసుకొని ఫ్రం అడ్రస్ చూసి పోస్టుమెన్ వెనక్కి తిరిగిన తర్వాత "ప్చ్" అని ముద్దు పెట్టుకుంది ఆ వుత్తరాన్ని. భర్త వ్రాసిన వుత్తరాన్ని చదవాలంటే ఏ భార్యకైనా సంతోషంగా వుంటుంది. అందులో ఏదో కొంత తీపి వుండక పోదుమరి. ఆ మధురానుభూతి కొరకే చదవసాగింది.

డియర్ సులో!

నా టూర్‌లో ఇది నీకు రెండవ ఉత్తరం. ప్రస్తుతం ఆగ్రానుంచి వ్రాస్తున్నాను. వెన్నెలలో తాజ్‌మహల్ వద్ద నీవు లేని లోటు మరీ కన్పించింది. దానిని చూడవలసిందే కాని వర్ణించలేను. ముంతాజ్ షాజహాన్‌ల అమర ప్రేమకు తార్కాణం నేటి తాజ్‌మహల్. నీ సరసన తాజ్‌మహల్‌ను వెన్నెలలో చూడాలని అప్పుడే! అక్కడ! నిశ్చయించుకున్నాను. షాజహానంత నిన్ను ప్రేమించలేకపోయినా వారి ప్రేమ చిహ్నాన్ని చూపించగలను. మిగతా విశేషాలు మూడు రోజుల తర్వాత దేవిగారి సముఖంలో అన్నీ....

నీ

విజయ్.

ఉత్తరం చదివిన సులోచనకు రవంత మనసులో అసూయ కల్గింది భర్తమీద తాను లేకుండా తాజ్‌ను చూసినందుకు కానీ ఆఖరున తనతో తప్పకుండా అక్కడకు వెళ్ళాలనుంది అని వ్రాసినందుకు సులోచన హృదయం పుప్పొంగి పోయింది తనమీద ప్రేమకు.

పదిరోజులు భరించిన ఎడబాటు ఒక్క రాత్రి గడవని రాత్రి ఎంతో బాధించింది సులోచనను.

కలతగా నిదురబోయింది. కలలో భర్తతో తాజ్‌మహల్‌వద్ద విహరించి అక్కడ ఫోటోలు తీయించుకున్నట్లు తీయటి కలలు కనసాగింది.

పాలమనిషి కేకతో నిదుర లేచింది. అబ్బా! ఎంతటి తీయని కల. నిజంగా ఎంత బాగుంటుంది. అలా శ్రీవారి ప్రక్కన వెన్నెలలో నడుస్తుంటే అని కలను నెమరువేసుకో సాగింది.

కాఫీ కలుపుకొని, స్నానంచేసి భర్త కొరకు ఎదురు చూడసాగింది సులోచన భర్త విజయ్ బాటనీ లెక్చరర్. కాలేజీ విద్యార్థులను బాటనీ టూరుకు తీసుకువెళ్ళి ఆగ్రానుండి వుత్తరం వ్రాశాడు భార్యకు.

టాక్సీ ఇంటిముందు ఆగిన చప్పుడు వినిపించి బయటకువచ్చి చూసింది సులోచన. విజయ్ ఒక బాక్స్‌ను అతి జాగ్రత్తగా పట్టుకొని వస్తున్నాడు. డ్రయివర్ సూట్‌కేస్ తీసుకొని వెనక వస్తున్నాడు.

భర్తనుచూసి సులోచన కండ్లలో ఏదో వింత వెలుగొచ్చింది భర్తకు ఎదురొచ్చి బాక్స్‌ను తీసుకోబోయింది.

"ఆగాగు జాగ్రత్త!"

"ఏమిటండీ ఆ అపురూప కానుక!"

"అపురూపమే కాని దానికి ప్రతిరూపం. షాజహాన్ తాజ్‌కు ప్రతిరూపం" అని నెమ్మదిగా బాక్స్ ఓపన్‌చేసి చూపించాడు.

అది తాజ్‌మహల్ మోడల్. భార్యకు ప్రేమతో తెచ్చిన కానుక.

"చాలా బావుందండీ. నామీద ప్రేమకు చిహ్నంగా తెచ్చారా? ప్రేమకు మారు పేరు తాజ్‌మహల్."

"సులో మరీ అంత పొగడకు. షాజ్‌హాన్ ప్రేమముందు నేనెంత?"

"అయినా మీ ప్రేమలో నాకు లోటేమిటండీ! చక్రవర్తి కాబట్టి అంత అందమైన కట్టడాన్ని నిర్మించాడు. తాజ్‌మహల్ కన్నా మీరే ఎక్కువ నా మదిలో. ఆ చక్రవర్తి రాజకీయాలతో, మంత్రి సామంతుల ముచ్చట్లతో భార్యను ఎప్పుడు అలరించేవాడో ఎవరికి తెలుసు? చనిపోయిన తర్వాత అందరూ చూసేందుకు ఒక పాలరాతి కట్టడం నిర్మించాడు. అందులో ఎందరు బలిఅయిపోయారో" అన్నది ఆవేశంగా.

"ఎంత లెక్చరిచ్చావు సులో" అంటూ భార్యను తన కౌగిలిలోనికి తీసుకున్నాడు. కొద్ది క్షణాల తర్వాత చిన్న శబ్దం వచ్చింది. వెంటనే—

"ఛీ సిగరెట్ కంపు" అంది.

"ఐయామ్ సారి" అంటూ బాత్‌రూమ్ వైపు పరుగెత్తాడు మరి కొంచెంసేపు వుంటే సిగరెట్లను గురించి లెక్చర్ యిస్తుందని భయపడి.

భర్తకు కాఫీ యిచ్చి టేబుల్‌పైన వున్న తాజ్‌మహల్‌ను అలాగే తదేకంగా చూడసాగింది.

"సులో" అన్నాడు

ఉలిక్కిపడి భర్తవేపు చూసి మరొకసారి "ఎంత బావుందండీ మీ ప్రేమ కానుక "

"దీని నేమిచూస్తావు. దీపావళి వెళ్ళిన తర్వాత అసలైన చక్రవర్తి కానుకను చూపిస్తాను. అంతవరకు దీనిని చూస్తూ వుండు."

## 2

ఇంటింటా దీపావళి వచ్చింది. అందరి మనసుల్లో వెలుగును తెచ్చింది. పిల్లలకు ఎంతో ఆనందం దీపావళి అంటే.

"ఇక త్వరలోనేగా మనం వెళ్లేది ఆగ్రాకు" అంది భర్తవైపు చూసి.

"యస్ డార్లింగ్, దేవిగారి కోరిక త్వరలో తప్పక చెల్లిస్తాం. ఇంతకూ దీపావళి సరుకు ఎండలో వుంచావా? లేకుంటేఅన్నీ రాత్రికి 'తుస్' మంటాయి"

"అలాగే పెట్టానండీ మన పక్కింటి బాబ్జి కాపలావున్నాడు."

"పచ్చే దీపావళికి మనకో బాబ్జీ వుండాలి తెలుసా! పోయిన రెండు దీపావళులకు ప్రక్కింటి బాబ్జియే వచ్చాడు. ఇక లాభంలే దమ్మాయి."

సిగ్గుతో ఇంట్లోకి వెళ్ళిపోయింది.

అమావాస్య చీకటిని ఇంటిముందరి ప్రమిదల వెలుతురుతో పారద్రోలుతున్నారు సులోచన ఇంటిముందర ప్రమిదలన్నిటినీ వెలిగించి ఒకసారి తృప్తిగా చూసింది. ఇంటికే కొత్తవెలుగొచ్చింది.

"ఆంటీ నేను రడీ" అని వచ్చాడు పక్కింటి బాబ్జి.

"నేనూ రడీ" అంటూ బాణాసంచాతో బయటకు వచ్చాడు విజయ్.

బాబ్జి చిచ్చుబుడ్లు కాల్చుతున్నాడు. విజయ్ బాంబులు కాల్చుతున్నాడు. వారికి సమీపంలో కాకరవత్తి కాలుస్తూ భర్తను చూస్తుంది అంతలో ప్రక్కింటి అబ్బాయి కాల్చుతున్న బాంబ్ ఎగిరివచ్చి సులోచన ప్రక్కన పేలింది. భయంతో తల ప్రక్కకు తిప్పింది. అప్పుడే బాబ్జి అంటించిన చిచ్చుబుడ్డినుండి లేస్తున్న నిప్పురవ్వలు బాగా ఎగసిపడుతున్నాయి. ఆ రవ్వలు కంట్లో పడ్డాయి. "అమ్మా" అంటూ భయంకరంగా అరిచింది. విజయ్ వచ్చి భార్యను పొదివి పట్టుకొని ఇంట్లోకి తీసుకు వెళ్ళాడు.

కంట్లో భరింపరాని మంటతో బాధపడ సాగింది హాస్పిటల్‌కు ఫోన్ చేసి అంబులెన్స్ పిలిపించి అందులో హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాడు.

ఐ స్పెషలిస్ట్ వచ్చి చూసి "కళ్ళు తెరవండి" అన్నాడు.

"తెరవలేను డాక్టర్ విపరీతమయిన మంట"

"చిన్నగా ప్రయత్నించండి"

భారంగా బాధతో కళ్ళుతెరిచి "డాక్టర్ ఏమండీ ..... నాకేమీ కనిపించటంలేదు. అంతా చీకటి. అబ్బా మంట. భరించలేను" అని మరలా కళ్లు మూసుకుంది.

"డాక్టర్ ...." అని సందిగ్ధంగా డాక్టర్ వైపు చూశాడు విజయ్.

"మీరేమి భయపడవద్దు. ఇప్పుడు కళ్ళకు ఆయింట్‌మెంట్ వేసి డ్రసింగ్ చేస్తాను. రెండు మూడు రోజులకుగాని ఏమీ చెప్పలేము."

## 3

మూడు రోజుల తర్వాత కళ్ళకు డ్రెస్సింగ్ విప్పి, ఎగ్జామిన్ చేశాడు డాక్టర్. ఆత్రుతగా డాక్టర్‌వైపుచూశాడు

"మిష్టర్ విజయ్ ప్లీజ్ కమ్‌విత్‌మి" అన్నాడు డాక్టర్.

ఇద్దరూ డాక్టర్‌కన్సల్టింగ్ రూములో కూర్చున్నారు.

ఐయామ్‌సారి విజయ్. నిప్పురవ్వలు కనుపాపలపై పడుట వలన అవి పనికి రాకుండా అయిపోయాయి. ప్రస్తుతం మేము చేసేదేమీ లేదు...."

"అంతేనాడాక్టర్. నా సులోచన అంధకారంలో జీవించ వలసిందేనా? అందరికి వెలుగిచ్చిన దీపావళి మా ఇంట అంధకారం తెచ్చింది డాక్టర్. మా జీవితాలింక వెలుగును చూడలేక కృశించి పోవలసిందేనా? డాకర్ మరొకసారి పరీక్షించండి"

"విజయ్ మీరు అప్‌సెట్ కావద్దు.

నే నెన్నిసార్లు పరీక్షించినా లాభం లేదు. కానీ, ఒక్కటి చెప్పగలను. చూపువచ్చే హోప్ వుంది. అయితే ఆమె కంటికి సరిపోయే కార్నియా దొరకాలి. అదీ, మీ అదృష్టం. మీరు హైద్రాబాద్ సరోజినీదేవి హాస్పిటల్ కెళ్ళి, ట్రయ్ చేయండి. అక్కడొక చోటే కార్నియా గ్రాఫ్టింగ్ చేస్తారు."

## 4

హైద్రాబాద్‌లోదిగి భార్యను సరోజినీ దేవి హాస్పటల్‌కు తీసుకెళ్ళాడు విజయ్. డాక్టర్ సత్‌పతి పరీక్షచేసి, రెండురోజుల తర్వాత ఎలాంటి కార్నియా కావలసిందీ డిసైడ్ చేసి ఐ బ్యాంక్ కెళ్ళి చూశాడు. కానీ అందులో సులోచనకు సరిపోయే కార్నియా లభించలేదు.

డాక్టర్ ఏ సంగతి తెలుపలేదు విజయ్‌కి. విజయ్‌కి మనసులో ఆందోళన రేగింది. మనసులోని ఆత్రుతను తట్టుకోలేక డాక్టర్ రూమువద్ద కెళ్ళాడు మాట్లాడేందుకు.

విజయ్‌ని చూసి "ప్లీజ్ కమిన్" అని రూములోకి ఆహ్వానించాడుడాక్టర్. విజయ్ డాక్టర్‌ను ఏదో అడగబోయాడు. అంతలో "మిష్టర్ చేయవలసిన టెస్టులన్నీ అయిపోయాయి. కానీ...." అని విజయ్ వైపు చూశాడు.

"చెప్పండి డాక్టర్, నా సులోచనకు చూపు వచ్చే అవకాశం వుందా ?"

"ష్యూర్ మిష్టర్ విజయ్, కానీ ప్రస్తుతం ఇక్కడ ఐబ్యాంక్‌లో ఆమెకు సరిపోయే కార్నియా (కనుపాప , దొరక లేదు. కొంత కాలం వెయిట్ చేస్తే దొరకొచ్చు. ఎంత కాలం పడుతుందో చెప్పలేం. ఢిల్లీలో ఐ బ్యాంక్‌లో కూడా ట్రయిచేసాం. కానీలాభం లేకపోయింది"

"డాక్టర్ నా కళ్లు పరీక్షించండి. అవి సరిపోయాయంటే నా హృదయ పూర్వకంగా నా భార్య కిస్తాను. నా జీవితంలో భాగం పంచుకొని, నన్నే నమ్ముకొని, తన వారందరినీ వదలుకొని నాకు సర్వం సమర్పించిన, నా సహధర్మచారిణికి ఇంతకన్నా నేనేమీ చేయలేను డాక్టర్.

"ప్లీజ్ ఎగ్జామిన్ మి డాక్టర్"

"మీది లవ్ మ్యారేజియా ?"

"యస్ డాక్టర్ మేము ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. మా పెళ్ళి సులోచన తల్లిదండ్రులకు ఏ పరిస్థితులలోనూ ఇష్టంలేదు. సులోచన ఆగర్భ శ్రీమంతురాలు. ఐశ్వర్యంలో పుట్టి పెరిగి ఖరీదయిన జీవితాన్ననుభవించిన యువతి. నాలాంటి సామాన్యునితో జత కలిపి సామాన్య జీవితం గడపుతున్న ప్రేమ మూర్తి."

"విజయ్, ప్రేమ ఎక్కడుందో అక్కడే త్యాగం, అనురాగం, ఆప్యాయత అన్నీ కలిసి వుంటాయి. మీప్రేమ జీవుల కెప్పుడూ దేవుడన్యాయంచేయడు మీ కిదొక పరీక్ష. మీరు దీనికి తట్టుకొని ప్రేమ అన్నిటికన్నా గొప్పదని నిరూపించాలి" అన్నాడు డాక్టర్.

డాక్టర్ గత జీవితంలో ఒక భగ్న ప్రేమికుడు. కోరిన ప్రేయసి దూరమై, తన జీవితాన్ని మానవ సేవకు అంకితం చేశాడు.

## 5

డాక్టర్ రూములో నుంచి విజయ్, డాక్టర్ ఇద్దరూ బయటకు వచ్చారు

ఏమి చెపుతాడోనని డాక్టర్ పై పుచూశాడు విజయ్.

"విజయ్ యూఆర్ లక్కీ. నీకనుపాప సరిపోతుంది. రేపే ఆపరేషన్‌కు ఫిక్స్ చేస్తాను. చనిపోయిన వారి కండ్ల కంటే నీ కన్నుతో మంచి రిజల్టు రావచ్చు. ఐ హోప్ది బెస్టు."

"అలాగే డాక్టర్ కానీ నేనిస్తున్నానని మాత్రం సులోచనకు తెలియ నీయ వద్దండీ. అంధురాలుగానైనా వుండేం దుకు సిద్ధపడుతుంది గాని, నా కన్ను తీసిస్తున్నానంటే అసలు ఆపరేషన్ కే ఒప్పుకోదు."

"అలాగే విజయ్"

వార్డుకు వెళ్ళి, సిస్టర్‌ను పిలిచి, సులోచనను రేపు ఆపరేషన్‌కు సిద్ధం చేయమని చెప్పాడు డాక్టర్.

మరొకసారి సులోచనను పరీక్షించి "రేపు ఆపరేషన్‌కు తయారు చేస్తున్నాం మిమ్మల్ని" అన్నాడు.

"డాక్టర్! నిజంగా రేపు ఆపరేషనా నాకు. నాకు సరిపోయే కళ్ళు లభించాయా! నాకు త్వరలో చూపు వస్తుందా. ఎంత సంతోషకరమైన వార్త డాక్టర్! నేను మరలా అందరిలా చూడగలనా?"

"ఆవేశం వద్దండి. మీకు మరలా కొత్త జీవితం వస్తుంది. మీరు అందరిలా, మునుపటిలా అందరినీ ప్రకృతి అందాన్ని చూడగలరు"

"ఆ కళ్ళు ఎవరివో చెప్పండి డాక్టర్. నాకు చూపు వచ్చిన తర్వాత వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలుపుకుంటాను.

## అనుబంధం

సింగిలో వెలిగేటి
నెలరాజు పిలువ
నిలువెల్ల పులకించి
పలికేను కలువ

మధురాను రాగాలు
తుదిలోన నిలువ
నడుమగల దూరాలు
విడదీయ గలవా?

కరి మబ్బు చెలికాడు
కనుసైగ సేయ
నెమలి నెచ్చెలి నాడు
నిండు వేడుక ప్రాయు

వలపు సూత్రాలే
తలపులను ముడి వేయ
వశమూన ఆ భావ
పాశమ్ము తెగనోయు.

ఈదుపల్లి వేంకటేశ్వరరావు

ఇంతకూ మా వారికి తెలుసా ఆపరేషన్ రేపుందని"

"మీ వారికి చెప్పిన పిమ్మటనే మీ వద్దకు వస్తున్నాను"

## 6

మరునాడు విజయ్‌ని సులోచనను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకు వెళ్ళారు. విజయ్ కంటినుంచి సజీవమైన కను పాపను తీసి సులోచన కంటిలో అతి కారు డాక్టర్లు.

ఇద్దరినీ వార్డుకు తీసుకెళ్లారు. డాక్టర్ రౌండ్సుకు వచ్చి విజయ్‌ని పలుక రించాడు.

"విజయ్ నీ ప్రేమమూర్తికి నీకన్ను నిచ్చి ప్రేమకు నిర్వచనం తెలిపావు."

"నో డాక్టర్, అదేమికాదు."

"నో విజయ్, ఎంతమందినో చూశాను ఈ వృత్తిలో, తన ఇల్లాలికి, కన్న తల్లికి, అవసరమైనప్పుడు రక్తం ఇచ్చేందుకు ముందుకు రావటంలేదు. ధనాన్ని వెచ్చించి ఎవరినో, ఏ రిక్షా వాడినో పిలుచుకువచ్చి వారి రక్తం ఇప్పిస్తారు. లేకుంటే, డాక్టర్ ఎంత డబ్బు ఖర్చయినా ఫరవాలేదు మీరే ఎలా గయినా సమకూర్చండి అని అంటారు. కానీ వారు ముందుకు రావటంలేదు. ఇది ప్రస్తుతం జరుగుతున్నది. రక్తమిచ్చినా మరలా కొద్ది రోజులకు ఆ రక్తం శరీ రంలో సమకూరుతుంది మీరు మీ జీవి తానికి వెలుగునిస్తున్న రెండు కళ్ళలో ఒక కంటినిచ్చి, ఒక కన్నుకు శాశ్వ తంగా కటిక చీకటిని కల్పించారు. రియల్లీ యూ ఆర్ గ్రేట్ విజయ్."

"నన్నుపొగడకండిడాక్టర్ ....ప్లీజ్."

"నా మనసులోని మాటను చెబు తున్నాను విజయ్. నేను పొగడంలేదు. లీవిట్, ఒక వారం తర్వాత బ్యాండేజి విప్పుతాం" అని వెళ్ళిపోయాడు.

వారం రోజులు గడిచి పోయాయి. విజయ్ వెళ్ళి సులోచనతో మాట్లాడి వస్తున్నాడు.

ఒకరోజు "ఏమండి నాకు కన్నును ప్రసాదించిన వారి అడ్రస్‌ను తీసుకోండి డాక్టర్ వద్ద, వారి వద్దకు వెళ్ళి నా హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకోవాలని వుంది" అంది సులోచన.

"అలాగే."

సులోచనకు కంటి బ్యాండేజి విప్పేం దుకు డాక్టర్ గదిలోకి పిల్చుకొని వచ్చారు సిస్టర్స్.

గదిలో కిటికీలన్నీ మూయించి ఎక్కువ వెలుతురు రాకుండా చూశాడు డాక్టర్. కాంతివంతమయిన లైట్లను తీసివేసి గ్రీన్‌లైట్ వెలిగించాడు. ఆ వెలుతురు ప్రశాంతంగావుంది.


సులోచన కంటికివున్న బ్యాండేజి విప్పి.

"ఇప్పుడు నెమ్మదిగా కళ్లు విప్పండి" అన్నాడు డాక్టర్.

గది అంతా పచ్చని వెలుతురుతో నిండింది.

సులోచన కళ్ళు నెమ్మదిగా తెరిచింది. ఒక కంటినుండి పచ్చని వెలుతురు కని పిస్తుంది. ఎదురుగా ఇద్దరు వ్యక్తులు వున్నారు నెమ్మదిగా పరీక్షించి చూసింది. వెంటనే "అమ్మా-నాన్న" అన్నది.

"డాక్టర్, మావారెక్కడ. కళ్ళు




మంటగా వున్నాయి" అంది వెంటనే.

"నీ కంటికి మరికొంత విశ్రాంతి కావాలి" అని బ్యాండేజి మార్చి, "మీవారు ఇక్కడనే వున్నారు ప్రక్కన ఫోన్ చేస్తున్నారు" అన్నాడు.

వెంటనే "సులో" అని భార్య ప్రక్కన వచ్చి నిలబడి భార్య చేతిని చేతిలోకి తీసుకున్నాడు ఆప్యాయంగా.

సులోచనకు చూపువచ్చినందుకు విజయ్ హృదయం ఆనందంతో నిండి పోయింది.

విజయ్ కంటికి ఇంకా బ్యాండేజి వుంది. విజయ్‌ని చూసి కన్ను ఇచ్చినట్టు గ్రహిస్తే సులోచన ఎగ్జయిట్ కాగలదని, సులోచనకు కనుపించకుండా ప్రక్కకు నిలబడి కంటికి బ్యాండేజి వేసిన తర్వాత వచ్చి నిలబడ్డాడు భార్య ప్రక్కన.

ప్రమాదంలో సులోచనకు కళ్ళు పోయిన సంగతి తెలుసుకొని విజయ్ అత్తా. మామగార్లు అక్కడకు వచ్చారు.

సామాన్యుడైన విజయ్ ప్రేమ ఎంతో గొప్పదని తెల్సుకొని విజయ్‌ని వారు అలక్ష్యం చేసినందుకు క్షమాపణలు కోరుకున్నారు.

## 7

విజయ్‌ని డాక్టర్ పిలిచి "ఈరోజు మీ శ్రీమతిని ఇంటికి తీసుకు వెళ్ళవచ్చు. నీ భార్య మీదున్న నీ ప్రేమకు, ఐశ్వర్యంకన్నా ప్రేమ గొప్పదని మీవారు గుర్తించారు విజయ్."

"వారు గుర్తించేందుకుగానీ, వారి పొగడ్తలకుగానీ నేనీపని చేయలేదు. నా ప్రేమమూర్తికి నా హృదయేశ్వరి కొరకు చేశాను. ప్రేమకొరకు ప్రాణాల్ని త్యాగంచేసిన వారున్నారు. నేనెంత డాక్టర్, కళ్ళలో ఒక కన్నును మాత్రమే ఇచ్చాను. ఇట్స్ నథింగ్."

విజయ్ మాటలు ఎంతో ఆనందం

కలిగించాయి డాక్టర్‌కు.

విజయ్ తన ఇంటికి చేరుకున్నాడు మామగారి కారులో, అత్తా మామగారు అదే మొదటి సారి కూతురింట్లో అడుగు పెట్టడం.

మరుసటి రోజు రాఘవరావు తన కూతురిని పిలిచి, "చూడమ్మా, నాకు అక్కడ చాలా పనివుంది. నీకు తోడుగా మీ అమ్మగారుంటారు కొన్నాళ్ళు. విజయ్‌లాంటి అల్లుడు మాకు, భర్తగా నీకు దొరకటం మన అదృష్టం. అతనికి నీ మీదెంత ప్రేముందో చెప్పలేం. మే మనుకున్నట్టుగా ఏ ధనవంతునికో నిన్నిచ్చింటే నీవు శాశ్వతంగా అంధకారంలో వుండేదానివి. కానీ నిన్ను ప్రాణంగా చూస్తున్న విజయ్ తన కళ్ళలో ఒక కంటినిచ్చి తన జీవితంలో వెలుగు నింపుకున్న ప్రేమమూర్తి" అని చెమర్చిన కళ్ళు తుడుచుకున్నాడు రాఘవరావు.

"ఏమండీ ఇది నిజమా! నా కొరకు మీ దృష్టిని నాకు ప్రసాదించారా! మీరు దేవతలండీ" అని ప్రక్కకు తిరిగి.

"అదో అటు చూడండి. మీరు తెచ్చిన తాజ్‌మహల్ ప్రతిరూపం. దానిని తన ప్రియురాలి స్మారక మందిరంగా నిర్మించిన షాజహాన్ కన్నా గొప్పవారండీ మీరు. చనిపోయిన తన ప్రేయసికొరకు నిర్మించాడు ఆ చక్రవర్తి. కానీ మీరు అంధకారంలో జీవిస్తూ మృతసమానురాలయిన నన్ను మీ కంటిలోని వెలుగుతో నాకు దృష్టిని ప్రసాదించిన ప్రేమమూర్తులు. ఆ చక్రవర్తి ప్రజల రక్తంతో, వారి శక్తితో వారి కానుకలు, కష్టాలతో నిర్మించాడు ఆ మందిరాన్ని. మీరు కంటిలోని కంటిని మీ రక్తంతో నిండిన కనుపాపను ప్రసాదించిన నా హృదయ చక్రవర్తులు." అని భర్త పాదాలపై వ్రాలింది.

"సులో, ఏమిటిది. ఏమి చేశానని నీకు, నా పాదాలపై వాలుతావు. నేనేమీ చేయలేదు. ఇదంతా నా స్వార్థం. నా అర్థాంగి అంధకారంలోవుంటే నా జీవితంలో వెలుగేది" అని కొద్దిగాఆగి గంభీరంగా వున్న పరిస్థితిని మార్చేందుకు.

"సులో మనం ఆగ్రాకు ఎపుడు వెళదాం తాజ్‌మహల్ చూచేందుకు. నీకు మాటిచ్చానుగా తాజ్‌మహలు చూపిస్తానని."

"నేను ఏ తాజమహలును చూడనండీ! తాజ్‌ను అసలు చూడను అక్కడేముందండీ నిర్జీవమైన ఒక పాలరాతి కట్టడం. ఇక్కడ సజీవమైన కానుక తాజమహల్‌కన్నా గొప్పది! నేను బ్రతికివుండగనే, నా ఆరాధ్య దేవతిచ్చిన ప్రేమకానుకను నాలోనే దాచుకున్నాను. ఇంతకన్నా గొప్ప ప్రేమ యెక్కడా లేదు.

"అయినా నేను తాజమహల్‌ను చూశానుగా!"

"ఎప్పుడూ? నాకు చెప్పలేదే! మరి!"

"నాలోవున్నకన్ను ఎప్పుడో చూసిందిగా. ఇప్పుడా పాత తాజమహల్‌ను చూసేదేముంది" అంది నవ్వుతూ.

★